సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ၊ 25 ၊ డిసెంబర్ ၊ 2024



దళారులకు విక్రయించవద్దు

కాఫీ రైతులు దళారులను నమ్మి వారికి విక్రయించి నష్టపోవద్దని జీసీసీ చింతపల్లి డీఎం దేవరాజ్ సూచించారు.

10లో



సిరులతల్లికి భక్తుల తాకిడి

విశాఖ: మార్గశిర మాసోత్సవాల 23వ రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



విశేషంగా ధూప పాశురం

ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా విశాఖ అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో ధూప పాశురం విశేషంగా విన్నవించారు.

న్యూస్‌రీల్

28న గంగవరంలో జాబ్‌మేళా

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి



అడ్డతీగల/గంగవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28 న గంగవరంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నిర్వహించే ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, మోహన్ స్పీ ఇంటెక్ కంపెనీలు పాల్గొంటాయన్నారు.18–35 ఏళ్ల మధ్య వయసు ఉండి ఇంటర్ ఆపై విద్యార్హతలున్న నిరుద్యోగ యువతీ యువకులు పాన్‌కార్డు,ఆధార్‌కార్డు,విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆమె సూచించారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వర్షంలోనూ పర్యాటకుల సందడి



అరకులోయ గిరిజన మ్యూజియం వద్ద పర్యాటకులు

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం , ఆంధ్రా ఊటి అరకులోయలో మంగళవారం పర్యాటకుల తాకిడి పెరిగింది. క్రిస్మస్ సెలవు సందర్భంగా అరకు సందర్శన నిమిత్తం ముందుగా లాడ్జీలు, హోటళ్లు రిజర్వేషన్లు దూర ప్రాంతాల వారు చేయించుకున్నారు. వీరంతా తరలిరావడంతో సందడి నెలకొంది. అయితే మంగళవారం సాయంత్రం వర్షం కురువడంతో వారు ఇబ్బందులు పడ్డారు.

జాబ్ మేళాకు దరఖాస్తుల ఆహ్వానం

- చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ భారతి



చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాకు ఈ నెల 25 నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.ఈ జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీఈడీ తదితర విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. చెన్నైకు చెందిన ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.17 వేల వేతనం, మిగిలిన సౌకర్యాలు కల్పిస్తారన్నారు. త్వరలోన జాబ్‌మేళా తేదీ ప్రకటిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యవతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు

ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో 27,567 మంది లబ్ధిదారులను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన చింతపల్లి, వీఆర్‌పురం, హుకుంపేట ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సీఈవోను ఆదేశించారు. మంగళవారం ఆయన అభివృద్ధి పథకాలపై సమీక్షించారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు ప్రారంభించకపోవడంతో పాటు వెబ్‌సైట్‌లో వారి వివరాలు నమోదు చేయని మండలాల ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో 64వేల మంది జాబ్‌కార్డుదారులకు వంద రోజుల పనులు కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలోను 100 ఫారంపాండ్స్ నిర్మాణాలను ఈ నెలాఖరకు పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులపై ఎంపీడీవోలు దృష్టి పెట్టాలని, లక్ష్యాలు సాధించలేని ఉపాధి హమీ పథకం అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి అన్ని రికార్డులను పరిశీలించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, సచివాలయాల్లో మహిళా పోలీసులు వివాహ రిజిష్టర్‌ను సక్రమంగా నిర్వహించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వర్చువల్‌గా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సింహాచలం, చైతన్య, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పశుసంవర్ధకశాఖ డీడీ నరసింహులు, హౌసింగ్ డీఈఈ బాబు పాల్గొన్నారు.

అధికారిక దోపిడీ

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో కాఫీ ధరలకు స్థానికంగా నిర్ణయించిన ధరలకు పొంతన ఉండటం లేదు. పార్చిమెంట్, చెర్రీ కిలోకు రూ.వందకు పైగా వ్యత్యాసం ఉన్నందున భారీగా నష్టపోతున్నామని గిరి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ జీసీసీ నిర్ణయించిన ధరలు తమను దోపిడీ చేసేలా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పార్చ్‌మెంట్ కాఫీ గింజలు

- జాతీయ మార్కెట్‌కు స్థానిక ధరలకు ఎంతో వ్యత్యాసం
- అక్కడ కిలో పార్చ్‌మెంట్ రూ.450, చెర్రీ రూ.250
- జీసీసీ ధర పార్చ్‌మెంట్ కిలో రూ.320, చెర్రీ రూ.170
- మాక్స్ పండ్ల ధర కిలో రూ.44
- ప్రభుత్వరంగ, మరికొన్ని సంస్థల ధరలు తక్కువగా ఉన్నాయని గిరి రైతుల ఆవేదన
- భారీగా నష్టపోతున్నామని మండిపాటు

సాక్షి,పాడేరు: కాఫీకి జాతీయ, అంతర్జాతీయస్థాయి మార్కెట్లో మంచి ధరలు ఉండటంతో ఈ ఏడాది అదేస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా అధికార యంత్రాంగానికి గిరి రైతులు విన్నవించుకుంటున్నారు. బెంగళూరు మార్కెట్లో పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ.430 నుంచి రూ.450, అరబికా చెర్రికి కూడా కిలో రూ.250 ధర ఉంది. చాలా దేశాల్లో కాఫీ దిగుబడులు తగ్గడంతో ఈ ఏడాది డిమాండ్ నెలకొంది. పార్చ్‌మెంట్ కాఫీ గింజల ధర ముమ్ముందు మరింత పెరిగు పరిస్థితులు కనిపిస్తున్నాయి. మన్యంలో 1.50 వేల ఎకరాల్లో కాఫీ తోటలు ఉండగా సుమారు 17 వేల టన్నుల వరకు దిగుబడి వస్తోంది. కాఫీ రైతుల నుంచి కొనుగోళ్లకు ఐటీడీఏ, జీసీసీ కార్యాచరణ రూపొందించాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ముందుకువచ్చాయి. అయినప్పటికీ జాతీయస్థాయి మార్కెట్లో ధరలకు అనుగుణంగా తమకు చెల్లించడం లేదని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ ఉన్నా..గిట్టుబాటు ధరలేక..

బెంగళూరు జాతీయ మార్కెట్‌లో కాఫీ గింజలకు రికార్డు ధరలు ఉన్నప్పటికీ గిరిజన రైతులకు మాత్రం గిట్టుబాటు ధర లేకపోతోంది.కాఫీ సీజన్‌కు ముందు జీసీసీ పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.285,అరబికా చెర్రి రూ.150 ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే బెంగళూరు మార్కెట్‌లో పార్చ్‌మెంట్ కాఫీ ధరలు కిలోకు రూ.400 దాటడంతో జీసీసీ అపెక్స్ కమిటీ కూడా ఏజెన్సీలో కొనుగోలు ధరలను కాస్త పెంచింది. పార్చ్‌మెంట్ కిలో రూ.320, అరబికా చెర్రిని కిలో రూ.170, రొబస్టా చెర్రి కిలో రూ.100 ధరకు కొనుగోలు చేస్తామని జీసీసీ ప్రకటించింది. బెంగళూరు మార్కెట్లో ధరలకు జీసీసీ ప్రకటించిన ధరలకు పొంతన లేకపోవడంతో కాఫీ రైతులు మండి పడుతున్నారు. పార్చ్‌మెంట్ కాఫీ గింజలు రూ.450, అరబికా చెర్రి కిలో రూ.250 ధర ఉన్నందున అందుకు తగ్గట్టుగా తమకు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కనీసం పార్చ్‌మెంట్ కిలో రూ.420, చెర్రి కిలో రూ.200 ధరకు కొనుగోలు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కాఫీ పండ్ల ధర అంతే..

పండ్ల దశలో కాఫీ పంటను అమ్ముకునే కాఫీ రైతులకు కూడా గిట్టుబాటు ధర కరువైంది. కిలో కాఫీ పండ్లను కిలో రూ.44ధరతో చింతపల్లి మాక్స్ సొసైటీ ద్వారా ఐటీడీఏ కొనుగోలు చేయిస్తోంది. బెంగళూరు మార్కెట్‌లో పెరిగిన ధరలు ప్రకారం చూసుకుంటే కిలో పండ్లకు కనీసం రూ.60ధర అయిన చెల్లించాల్సి ఉంది. అయితే ఐటీడీఏ మాత్రం ధరలు పెంచకపోవడంతో కాఫీ పండ్లను తక్కువ ధరకే అమ్ముకుంటూ కాఫీ రైతులు ఉసూరుమంటున్నారు. కొన్ని ప్రైవేట్ సంస్థలు మాత్రం కాఫీ పండ్లకు కిలో రూ.60 చెల్లిస్తున్నాయి. గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగంలోని జీసీసీ, ఐటీడీఏలు తక్కువ ధరలతో కాఫీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం అన్యాయమని కాఫీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం పట్టించుకోవాలి



బెంగళూరు మార్కెట్‌లో కాఫీ గింజలకు అధిక ధరలు పలుకుతున్నా,కష్టపడి సాగుచేసిన రైతులకు మాత్రం గిట్టుబాటు ధర లేకపోతోంది.కాఫీపంటను సేకరించి పల్పింగ్ చేసి నాణ్యమైన పార్చ్‌మెంట్ కాఫీ గింజలను తయారు చేసేందుకు ఎంతో కష్టపడుతున్నాం. జీసీసీ కూడా కిలో రూ.320 ధర అమలుజేయడం అన్యాయం. కిలో రూ.450తో పార్చ్‌మెంట్‌ను కొనుగోలు చేయాలి. కాఫీ పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం పట్టించుకోవాలి.

– గెమ్మెలి పూర్ణారావు, కాఫీ రైతు, మోదాపల్లి, పాడేరు మండలం

కాఫీ పండ్ల ధర పెంచాలి



కాఫీ పండ్లకు కూడా గిట్టుబాటు ధర కరువైంది. కిలో రూ.44తో చింతపల్లి మాక్స్ సంస్థ కొనుగోలు చేస్తుంది. ఈ తక్కువ ధరతో అమ్ముకుంటే నష్టమే మిగులుతుంది.కిలో రూ.70ధరతో కాఫీ పండ్లను ఐటీడీఏ కొనుగోలు చేయాలి. ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయ స్థాయి మార్కెట్లో ధరలు బాగున్నాయి. అందుకు తగ్గట్టుగా ధరల చెల్లించేలా పాడేరు ఐటీడీఏ, గిరిజన సహకార సంస్థ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– దిప్పల సురేష్‌బాబు, కాఫీ రైతు, గుర్రగరువు, పాడేరు మండలం

అధికారులతో కమిటీ వేస్తాం



ఏజెన్సీలోని కాఫీపంట సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి న్యాయం చేస్తున్నాం. బెంగళూరు కాఫీ మార్కెట్‌లో నాణ్యత ప్రకారం రోజువారి కాఫీ ఉత్పత్తుల ధరలపై సమీక్షించేందుకు అధికారులతో కమిటీ వేస్తాం. కాఫీ రైతులు నష్టపోకుండా అపెక్స్ కమిటీ ఆమోదంతో జీసీసీ ఇప్పటికే ధరలను పెంచి కొనుగోలుకు ఏర్పాట్లు చేసింది. చింతపల్లి మాక్స్ సంస్థకు కాఫీ పండ్లను అమ్ముకుంటున్న కాఫీ రైతులకు న్యాయం చేస్తాం. కాఫీ గింజల ఉత్పత్తి అనంతరం బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి అమ్మకాల ద్వారా వచ్చే లాభాలను ఆయా కాఫీ రైతులకు బోనస్ రూపంలో చెల్లిస్తాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

విద్యుత్ చార్జీలు పెంచి సంపద సృష్టిస్తున్నారా?



ఎంపీ విజయసాయిరెడ్డికి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, బోని శివరామకృష్ణ



'వైఎస్సార్‌సీపీ పోరుబాట' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్ర, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

- విద్యుత్ చార్జీల పెంపుపై 27న 'వైఎస్సార్‌సీపీ పోరుబాట'
- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.15 వేల కోట్ల భారం మోపడాన్ని నిరసిస్తూ ఈనెల 27న తలపెట్టిన 'వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో 'వైఎస్సార్ సీపీ పోరుబాట' పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విశాఖ జిల్లా ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ముందుగా ప్రతీ నియోజకవర్గంలో సంబంధిత విద్యుత్ కార్యాలయాల అధికారులకు, తరువాత అంతా కలిసి జిల్లా విద్యుత్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే వినియోగదారులపై సర్దుబాట చార్జీల పేరిట రూ.15 వేల కోట్లు భారం మోపుతున్నారని మండిపడ్డారు. సంపద సృష్టి అంటే పేదల భారం వేయడమా అని ప్రశ్నించారు. నాణ్యమైన విద్యుత్, విద్య, వైద్యాన్ని అందిస్తామని చెప్పి మద్యాన్ని ఏరులా పారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, పండుల రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, కంబాల జోగులు, మళ్ల విజయప్రసాద్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, చెంగల వెంకటరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ముఖ్యనేతలు శోభ హైమావతి, బొడ్డేటి ప్రసాద్, రవిరెడ్డి, సూర్యనారాయణరాజు, బాణాల శ్రీనివాసరావు, పిల్లా సుజాత, బి.పద్మావతి, పేడాడ రమణకుమారి, పల్లా చినతల్లి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి కేక్ కట్ చేశారు.

గురుకుల విద్యార్థి మృతిపై విచారణ

- ఉపాధ్యాయులు, స్నేహితుల నుంచి వివరాల సేకరణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం
- త్వరలో వివరాలు వెల్లడిస్తాం: చింతపల్లి డీఎస్పీ షహబాజ్ అహ్మద్



మనోజ్ (ఫైల్)

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి వంతల మనోజ్ కుమార్ (14) మృతిపై చింతపల్లి డీఎస్పీ షహబాజ్ అహ్మద్ విచారణ వేగవంతం చేశారు. ఈనెల 13 సాయంత్రం పాఠశాల నుంచి అదృశ్యమైన మనోజ్‌కుమార్ సోమవారం ఇక్కడి సమీపంలోని చెరువులో మృతదేహమై కనిపించడం తెలిసిందే. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. దీనిలో భాగంగా చింతపల్లి డీఎస్పీ మంగళవారం పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఉపాధ్యాయులను, మనోజ్ కుమార్ స్నేహితులు ఏడుగురిని విచారించారు. అనంతరం విద్యార్థికి చెందిన పెట్టె, ఇతర వస్తువులను, పాఠశాల ఆవరణను పరిశీలించారు. సెక్యూరిటీ సిబ్బంది, వర్కర్లను విచారించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి మృతిపై త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. పోలీసులపై విద్యార్థి బంధువులు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. చెరువులో వెలుగు చూసిన మృతదేహం మనోజ్‌గా అతని స్నేహితులు గుర్తించారన్నారు. ఇలావుండగా పాడేరు నుంచి వచ్చిన క్లూస్ టీం విద్యార్థి మృతదేహం బయటపడిన చెరువును పరిశీలించింది. వివరాలు సేకరించింది.



పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న డీఎస్పీ షహబాజ్ అహ్మద్



ఘటన స్థలంలో పరిశీలిస్తున్న క్లూస్ టీం

విస్తారంగా వర్షాలు

జీకే వీధిలో అధికంగా 12 మిల్లీమీటర్లు నమోదు



పాడేరులో కురుస్తున్న వర్షం


సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం ఏకదాటిగా కురవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాజ్‌మా పంటకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చివరిదశలో ఉన్న వరిపంట కోతలను గిరిజన రైతులు నిలిపివేశారు. పండ్ల దశలో ఉన్న కాఫీ పండ్లు కూడా నేల రాలే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లాలోని జీకే వీధిలో 12, పెదబయలులో 7.8, హుకుంపేటలో 7.8, జి.మాడుగులలో 7.2, ముంచంగిపుట్టులో 7.2, పాడేరులో 6.8, చింతపల్లిలో 6.6, అనంతగిరిలో 6.4, రంపచోడవరంలో 6.2, మారేడుమిల్లిలో 4.2, దేవిపట్నంలో 3.2, డుంబ్రిగుడలో 3.6, వై.రామవరంలో 2.8, గంగవరంలో 2.4, అడ్డతీగలలో 2.2, రాజవొమ్మంగిలో 0.4 మిల్లీ మీటర్ల వర్షపాతం మంగళవారం నమోదైంది.

పీసా గ్రామ సభలతో ప్రత్యేక అధికారాలు

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: పీసా గ్రామసభల ద్వారా ఆదివాసీలతో పాటు గ్రామాలకు ప్రత్యేక అధికారాలు ఏర్పడతాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి అధ్యక్షతన మంగళవారం జాతీయ పీసా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 7వతేదీ వరకు గ్రామ సభల ద్వారా పీసా ఎన్నికలు జరిపి, ఉపాధ్యక్షుడు, కార్యదర్శిలను ఎన్నుకోవాలన్నారు. గ్రామసభలకు ప్రత్యేక అధికారాలు సంక్రమిస్తాయని, తద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం మత్తు పదార్థ రహిత పాడేరుగా తీర్చిదిద్దాలనే నినాదంతో కలెక్టర్ అందరి చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డీపీవో బి.లోవరాజు,ఎంపీడీవో డేవిడ్‌రాజు, మండల విస్తరణ అధికారి రమేష్,వీఆర్‌వో మర్రిచెట్టు రామ్‌నాయుడు పాల్గొన్నారు.

అపురూపం.. చరిత్రకు సాక్ష్యం

- ఏజెన్సీలో మొట్టమొదటి ప్రార్థన మందిరం సుంకరమెట్ట చర్చి
- నిర్మించిన కెనడా దేశస్తుడు రాల్ఫ్‌స్మిత్
- 1939 నుంచి ప్రార్థనలు
- అప్పటినుంచి విస్తరించిన క్రైస్తవ బోధనలు
- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



ఏజెన్సీలో మొట్టమొదట సుంకరమెట్టలో నిర్మించిన పురాతన క్రైస్తవ ప్రార్థన మందిరం



విద్యుత్ అలంకరణలో హుకుంపేటలోని జేసీఈఎఫ్ ప్రార్థన మందిరం



పాడేరులోని కారుణ్య ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో మొట్టమొదట క్రైస్తవ ప్రార్థన మందిరమైన సుంకరమెట్టలోని కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. అరకులోయ మండలంలోని ఈ చర్చికి ఎంతో పురాతన చరిత్ర ఉంది. ఏజెన్సీలో క్రైస్తవ ప్రార్థనలు సీబీఎం ఆధ్వర్యంలో 1939 నుంచి ఈ చర్చిలోనే ప్రారంభమయ్యాయి.

- అరకు–విశాఖ ప్రధాన రోడ్డుకు ఆనుకుని కొండపై చర్చి కట్టడం ప్రకృతి అందాల మధ్య కనువిందు చేస్తుంది. ఈ ప్రాంతం పర్యాటకంగా ప్రాచుర్యం పొందింది.
- కెనడా దేశానికి చెందిన వైద్యుడు రాల్ఫ్‌స్మిత్ 1934లో తమ మిషనరీ ద్వారా క్రైస్తవ బోధనల నిమిత్తం ఏజెన్సీకి వచ్చారు. పెదగంగుడి, సుంకరమెట్ట గిరిజనులకు వైద్యసేవలు అందిస్తూ క్రైస్తవ బోధనలు చేసేవారు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న ఒడిశాలోని జైపూర్ మహారాజులకు గిరిజనులు, రాల్ఫ్‌స్మిత్ చర్చి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విన్నవించుకున్నారు. ఈ మేరకు సమ్మతించడంతో రాల్ఫ్‌స్మిత్ తన సొంత నిధులతో ఈ చర్చిని నిర్మించారు. అప్పటిలో దీని నిర్మాణానికి మద్రాస్ నుంచి పెంకులను రప్పించారు. చెక్కసున్నం, రాతి గుండను చర్చి నిర్మాణానికి వినియోగించారు. ఇసుకను వాడకుండానే ఈ భవనంను నిర్మించారని చెబుతుంటారు. 1939 సెప్టెంబర్ 17న దీని రాల్ఫ్‌స్మిత్ ప్రారంభించారు. ఆ తరువాత నుంచి ఏజెన్సీ వ్యాప్తంగా క్రైస్తవ బోధనలు విస్తరించాయి. ఆయన 1954 వరకు ఈ చర్చిలోనే ప్రార్థలను చేసేవారని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో దీనిని కెనడియన్ బాప్టిస్ట్ మిషన్(సీబీఎం)లో విలీనం చేశారు. అనంతరం ఆయన కెనడా దేశానికి వెళ్లిపోయారు. ఆ తరువాత కాకినాడ సీబీఎం చర్చికి చెందిన తాటికొండ విక్టర్‌జోషఫ్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. సీబీఎం ద్వారా ఏజెన్సీ వ్యాప్తంగా ప్రార్థన మందిరాల నిర్మాణాలను విస్తరించారు. ఇలా అపురూప కట్టడంగా ఈ చర్చికి గుర్తింపు ఉంది.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని అన్ని ప్రార్థన మందిరాలను ముస్తాబు చేశారు. ప్రార్థనల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని పురాతన సీబీఎం, కారుణ్య ప్రార్థనమందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. హుకుంపేటలోని పురాతన జేసీఈఎఫ్ ప్రార్థన మందిరం విద్యుత్ దీపాల అలంకరణతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

క్లుప్తంగా

దళారులకు విక్రయించవద్దు

- కాఫీ రైతులతో జీసీసీ చింతపల్లి డీఎం దేవరాజ్

చింతపల్లి: కాఫీ రైతులు దళారులను నమ్మి వారికి విక్రయించి నష్టపోవద్దని జీసీసీ చింతపల్లి డీఎం దేవరాజ్ సూచించారు. మంగళవారం మండలంలో కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని జున్నుల గ్రామాన్ని సందర్శించారు. రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గిరిజన రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో గతంలో ఎపెక్స్ కమిటీ ప్రకటించిన ధరలను సవరించి అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుకూలంగా పార్చిమెంట్ రూ.320, అరాబిక చెర్రి, రూ.170, రొబస్టా రూ.100కు పెంచి కొనుగోలు చేస్తున్నామన్నారు. తమ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది మీచెంతకు వచ్చి కచ్చితమైన ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలతో కొనుగోలు చేస్తారన్నారు.కొనుగోలు చేసిన 24 గంటల్లో మీఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు.

బాలికల ఉన్నతికి కృషి చేయాలి

- ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కిశోర వికాసంపై వివిధ శాఖల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పీవో మాట్లాడుతూ బాలికల ఉన్నతికి అన్ని శాఖల సిబ్బంది కృషి చేయాలన్నారు. కిశోర బాలికల ఆరోగ్యంపై వారి తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని, పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించారు. వారి హక్కుల పరిరక్షణకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయగౌరి, సీఐ దుర్గాప్రసాద్, ఎస్‌ఐ రమేష్, ఎంఈవో-2 వెంకటేశ్వర్లు, వైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలులో కూటమి విఫలం

- ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- విద్యుత్ చార్జీల పెంపుపై 27న పోరుబాట
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి నేడు అమలు చేయలేని పరిస్థితిలో ఉందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు), మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విమర్శించారు. కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను మంగళవారం రంపచోడవరంలో వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ నెల 27న రంపచోడవరం విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అన్నివర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అధికారంలో లేనప్పుడు కరెంటు చార్జీలు పెంచారని చెప్పిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో విద్యుత్ చార్జీలను పెంచారన్నారు. ఎవరు హయాంలో విద్యుత్ చార్జీలు పెరిగాయో ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంపద సృష్టించడం అంటే విద్యుత్ చార్జీలు పెంచడమేనా అని ధ్వజమెత్తారు. రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు చేశారన్నారు. ఇక్కడి పాలకులు అబద్ధాలు చెప్పడమే ఎజెండాగా పెట్టుకున్నారని ఎమ్మెల్సీ అనంతబాబు విమర్శించారు. వారి అక్రమాలపై ఇటీవల మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆధారాలతో ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఏజెన్సీలో ఎల్‌టీఆర్‌పీ కేసులు ఎవరు పెడతారో తెలియని పరిస్థితిలో వారు ఉన్నారన్నారు. ఒక లాయర్ వల్ల సాధ్యపడదని తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క గిరిజనుడు కూడా ఇబ్బంది పడకుండా చూశామన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరిషాదేవి నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. మాట్లాడడం నేర్చుకో అంటూ హితవు పలికారు. ఏజెన్సీలో పేకాట, గుండాట ఎమ్మెల్యే భర్త అనుచరుడే నిర్వహిస్తున్నాడని ఆరోపించారు. ఇటీవల పోలీసులు పేకాట శిబిరాలపై దాడి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే బంధువే వీటిని నిర్వహిస్తున్నాడని పట్టుబడిన వారు చెప్పారన్నారు. ఎమ్మెల్యే పీఏలు చిన్న వ్యాపారులను సైతం బెదిరిస్తున్నారని ఆరోపించారు. తన రాజకీయం జీవితంలో ఎంతో మందిని చూశానని, ఎవరికీ భయపడేది లేదని, ప్రజల పక్షాన్న నిలబడతామన్నారు. అధికార పార్టీకి సంబంధించిన ఇంటిలిజెన్సీ నివేదికను ఒకసారి చూస్తే మీ పరిస్థితి ఏంటో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య,వడగల ప్రసాద్, ఎంపీటీసీలు వంశీ కుంజం, ఉలవల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభ్యాసానికి రుణాలు

కలెక్టర్ దినేష్‌కుమార్



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఉన్నత విద్యాభ్యాసానికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారుణాలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్‌క్రైమ్‌లపై ప్రజలు,విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.రబీ పంటలతో పాటు వ్యవసాయ అనుసంధానమైన సంస్థలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని,పేదల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకులు తగిన సహకారం అందించాలన్నారు. మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్‌పతి దీదీ పథకం కింద రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈసమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, ఎల్‌డీఎం మాతునాయుడు,అన్ని బ్యాంకుల మేనేజర్లు,వ్యవసాయ,ఉద్యానవన.అనుబంధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు అమలు

గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగుల నెలవారీ జీతాలు చెల్లింపులకు సంబంధించి జనవరి 1వ తేదీ నుంచి మార్గదర్శకాలు అమలుజేస్తున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.రోజువారీ హాజరును గుర్తించడానికి జీఎస్‌డబ్ల్యూఎస్ హాజరు మొబైల్ యాప్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు.అన్ని రకాల సెలవులకు హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్ ద్వారా ముందస్తు అనుమతితో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సచివాలయాల్లో ప్రతి పౌరుడికి సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

పంటను దళారులకు అమ్ముకోవద్దు

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ



రాజవొమ్మంగి మండలం దూసరపాము వద్ద రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రాజవొమ్మంగి: ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. మంగళవారం ఆమె పాడేరు వెళుతూ మార్గమధ్యంలో మండలంలోని దూసరపాము వద్ద కాసేపు ఆగారు. రహదారికి పక్కన ధాన్యం రాశులు పోసి విక్రయించుకోడానికి ఎదురు చూస్తున్న రైతులతో ఆమె మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. సబ్‌కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్వో దాక్షాయని ఉన్నారు.

పీసా చట్టంపై అవగాహన కల్పించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



గంగవరంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

గంగవరం : పీసా చట్టం, హక్కులపై గిరిజనులకు అవగాహన కల్పించాలని, పీసా గ్రామసభలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. స్థానిక గ్రామసచివాలయంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన పీసా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గిరిజనులందరూ కలిసికట్టుగా పీసా కమిటీ గ్రామ సభల్లో గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన తీర్మానాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.జి.రామకృష్ణ, డీఎల్‌పీవో నరసింగరావు, వెలుగు ఏపీఎం షణ్ముఖరావు, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, ఆదివాసీ నాయకులు సిద్ధూ, బుల్లియమ్మ, నరేష్, పంచాయతీ కార్యదర్శి కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు ఏపీజీవీబీ సేవలు నిలిపివేత

- గ్రామీణ వికాస్ బ్యాంకు ఆర్‌ఎం సతీష్‌చంద్ర



సాక్షి,పాడేరు: భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు ఏపీజీవీబీ ఆంధ్రా,తెలంగాణ విభాగాల విభజన దృష్ట్యా ఈనెల 28వతేదీ నుంచి నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలను నిలిపివేస్తున్నామని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్‌చంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని వరంగల్ కేంద్రంగా ఏపీజీవీబీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తుందని, అయితే బ్యాంకు కార్యకలాపాలను రెండు రాష్ట్రాల్లో విభజన జరుగుతుందన్నారు.ఈనెల 28వతేదీ నుంచి 31వతేది వరకు బ్యాంకు సేవలతో పాటు ఏటీఎం కార్డులు,ఆన్‌లైన్ నగదు లావాదేవీలన్నీ నిలుపుదల చేస్తున్నామన్నారు. 2025 జనవరి ఒకటి నుంచి బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయని, ఈ విషయాన్ని ఖాతాదారుల గమనించాలని ఆర్‌ఎం కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: గంగవరం మండలం పిడతమామిడి గ్రామ పంచాయతీకి చెందిన తెలుగుదేశం నాయకులు ఆకుల అప్పారావు, కొంతమంది కార్యకర్తలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. రంపచోడవరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ (బాబు), నియోజకవర్గం ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమక్షంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ అనంత బాబు,మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గంగవరం, రంపచోడవరం మండల కన్వీనర్లు అప్పలరాజు, రామన్నదొర, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, పిడతమామిడి సర్పంచ్ నేషం మరిడమ్మ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, రంపచోడవరం జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీపీ బంధం శ్రీదేవి, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, ప్రసాద్ వెంకటలక్ష్మి, రామకృష్ణ, రమేష్ , ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, వంశీ, కాపారపు రూతు, బొప్ప శేఖర్, చితుకులు రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో గ్రామ సభల ఆమోదం తప్పని సరి

- ఐటీడీఏ పీవో అభిషేక్



గ్రామ సభలో మాట్లాడుతున్న పీవో అభిషేక్

దుంబ్రిగుడ: ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపికలో గ్రామ సభల ఆమోదం తప్పనిసరిగా ఉండాలని పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు.అరకు గ్రామ పంచాయతీలో సర్పంచ్ జి.శారద ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పీసా దినోత్సవంలో పీవో మాట్లాడారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ చాటరి జానకమ్మ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎటీడబ్ల్యూవో మల్లికార్జున్ పాల్గొన్నారు.

కాఫీ రైతులకు అధిక ధరల చెల్లింపు



రైతులు నుంచి కాఫీ కొనుగోలు చేస్తున్న ఎఫ్‌పీవో ప్రతినిధి

చింతపల్లి: గిరిజన కాఫీ రైతులకు థింసా ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘం అధిక ధరలు చెల్లిస్తున్నట్టు సీఈవో దేవి ప్రవల్లిక తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు.ప్రభుత్వం ప్రకటించిన కాఫీ ధరల కంటే అధిక ధరలు చెల్లిస్తున్నట్టు చెప్పారు.కిలో పార్చిమెంట్‌కు రూ.335, అరబిక చెర్రి రూ.175, రొబస్టా రూ.103,కాఫీ పండ్లు కిలోకు రూ.55 చెల్లించి, కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించారు.అదే విధంగా పచ్చి పసుపు రూ.20 లకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు.


యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు డిగ్రీ విద్యార్థులు



యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

అరకులోయటౌన్: కడపలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు. వై.విజయలక్ష్మి తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వివిధ అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పరాజ్, అధ్యాపకుడు కొండబాబు అభినందించారు.

18,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



దాడుల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

ఎటపాక: రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాక మండలంలో సారా తయారీ కేంద్రాలపై రెండు తెలుగు రాష్ట్రాల ఎక్సైజ్,పోలీసు శాఖల అధికారులు మూకుమ్మడిగా దాడులు చేశారు. పిచుకలపాడు,గుండువారిగూడెం గ్రామాల్లో ఎక్సైజ్,సివిల్ పోలీసులు మంగళవారం జరిపిన దాడుల్లో సారా తయారీకి వినియోగించే 18,500 లీటర్ల బెల్లం ఊటను , 200 లీటర్ల డిస్టిల్ మద్యాన్ని ధ్వంసం చేశారు.సారా తయారీకి వినియోగించే డ్రమ్ములు, పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో ఇరు రాష్ట్రాల ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్,సీఆర్పీఎఫ్ బృందాల అధికారులు పాల్గొన్నారు.

కాఫీ రైతులను ఆదుకోవాలి



కాఫీ తోటలు పరిశీలిస్తున్న కాఫీ రైతు సంఘం నాయకుడు చినబాబు

అరకులోయటౌన్: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన కాఫీ రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని కాఫీ రైతుల సంఘం నాయకుడు చినబాబు డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా సుంకర మెట్టలోని దెబ్బతిన్న కాఫీ తోటలను మంగళవారం ఆయన పరిశీలించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. గిరి రైతులు పండించే కాఫీకి మద్దతు ధర లభించకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. జీసీసీ సరైన మద్దతు ధర ప్రకటించకపోవడంతో కాఫీ రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతులు కొర్రా చిట్టిబాబు, గెమ్మెలి లక్ష్మణ్, కొర్రా సింహాచలం పాల్గొన్నారు.

వస్త్ర దుకాణాలు కిటకిట



కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న అరకులోని వస్త్ర దుకాణం

దుంబ్రిగుడ: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని పలు వస్త్ర దుకాణాలు కొనుగోలు దారులతో మంగళవారం కిటకిటలాడాయి. గిరిజనులు పెద్ద ఎత్తున నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు. దుంబ్రిగుడ మండలంలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన వారితో పాటు ఒడిశా నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ వస్త్రాలు కొనుగోలు చేశారు.

విద్యుత్ షాక్‌తో గిరిజనుడి మృతి



వంతల చిట్టిబాబు మృతదేహం

చింతపల్లి: మండలంలో గచ్చుపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో బెన్నవరం పంచాయతీ పరిధి గచ్చుపల్లి గ్రామానికి చెందిన వంతల చిట్టిబాబు (40) అనే గిరిజనుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిట్టిబాబు ప్రతిరోజు వలే కాఫీ తోటలో మిరియాలు ఏరివేతకు వెళ్లాడు. మిరియాలు ఏరడానికి ఉపయోగించే నిచ్చెన విద్యుత్ వైర్లకు తగలి షాక్ గురై మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. భార్యాపిల్లలు భోరున విలపించారు.

గ్రామాభివృద్ధికి పీసా కమిటీలు కృషి చేయాలి



సత్యనారాయణ రెడ్డి, హనుమంతు రెడ్డిలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీఎల్‌పీవో

గంగవరం : పీసా గ్రామ కమిటీలు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి (ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో) నరసింగరావు అన్నారు. పెద్ద అడ్డపల్లి గ్రామంలో ఎండపల్లి సర్పంచ్ బి.రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన పీసా గ్రామసభలో ఆయన మాట్లాడారు. పీసా చట్టం గురించి గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా పెద్దఅడ్డపల్లి పీసా ఉపాధ్యక్షుడుగా యాట్ల సత్యనారాయణ రెడ్డిని, కార్యదర్శిగా యాట్ల హనుమంతు రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్ వీరరాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ తీగలప్రభ, కార్యదర్శి కృష్ణస్వామి, వీఆర్వో వెంకటేశ్వర్లు గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న లైంగిక వేధింపులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గిరిజన మహిళ సంఘం అధ్యక్షురాలు ఈశ్వరి

ముంచంగిపుట్టు: ఆడపిల్లలు, మహిళలపై లైంగిక దాడులు, నిర్బంధాలు, వేధింపులు పెరుగుతున్నాయని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని గిరిజన మహిళ సంఘం(ఐద్వా)మండల అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1,2, కళాశాల విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లైంగికదాడులను నిరోధించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పక్కాగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళ సంఘం మండల కార్యదర్శి ఎస్.విజయ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ,గిరిజన సంఘం మండల నేతలు గాసిరాందొర, లైకోన్, రామదాసు, పీడీ అశోక్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

96 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుకున్న ఒడిశా మద్యం, నిందితుడితో ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: అక్రమంగా తరలిస్తున్న ఒడిశా మద్యాన్ని మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద మంగళవారం పట్టుకున్నట్టు ఎస్‌ఐ జె.రామకృష్ణ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశా నుంచి వచ్చిన మారుతీ కారును పరిశీలించగా డిక్కీలో 96 మద్యం బాటిళ్లు బయటపడ్డాయని చెప్పారు. దీంతో కారు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఒడిశాకు చెందిన నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఒడిశా రాష్ట్రం కొర్రాపుట్టు జిల్లా లంతాపుట్టు బ్లాక్ మచ్‌ఖండ్ గ్రామానికి చెందిన దుంబుధర్ హంతల్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.14 వేలు ఉంటుందని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

క్వారీలో రాళ్లు పడి వ్యక్తి మృతి

బ్లాస్టింగ్‌కు గుంతలు చేస్తుండగా ప్రమాదం



మృతి చెందిన చూర్ల లక్ష్మణదొర

రంపచోడవరం: మండలంలోని ఊట్ల గ్రామ సమీపంలోని నిర్వహిస్తున్న ఒక మెటల్ క్వారీలో రాళ్లు పడి వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ సాధిక్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఊట్లలోని మెటల్ క్వారీలో తూర్పుగోదావరి జిల్లా ఠాకూర్‌పాలెంకు చెందిన నలుగురు పనిచేస్తున్నారు. వీరు క్వారీలో బ్లాస్టింగ్ చేసేందుకు గుంతలు చేస్తుండగా వైబ్రేషన్ రావడంతో ఒక్కసారిగా పైనుంచి రాళ్లు పడ్డాయి. దీంతో చూర్ల లక్ష్మణదొర (50)కు తలకు తీవ్ర గాయాలు కావడంతో గోకవరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మరోవ్యక్తి కూడా తీవ్ర గాయాలు కాగా అతని పరిస్థితి విషమంగా ఉందని ఎస్‌ఐ తెలిపారు. అసలు క్వారీలో బాంబులు బ్లాస్టింగ్ చేసేందుకు అనుమతులు ఉన్నాయా, గిరిజనులు పేరుతో బినామీలు క్వారీ నిర్వహిస్తున్నారన్న కోణంలో ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాలని గిరిజనుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది.